# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పైలట్ ప్రాజెక్టును ప్రారంభించారు.
- ❖ రాష్ట్రంలో రహదారుల నిర్మాణాన్ని వచ్చే డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి తెలిపారు.
- ❖ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే భవిష్యత్ ఏర్పరచుకోవాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు.
- ❖ గిరిజన గ్రామాలలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి వెల్లడించారు.

==================================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో పర్యటించారు. నడిమూరు గ్రామంలో 'సూర్య ఘర్ యోజన' పైలట్ ప్రాజెక్టును ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ప్రసంగిస్తూ... ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతి ఇంటిలో నెలకు 200 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేసుకొనేందుకు అవకాశం ఉందన్నారు. 60 యూనిట్లు వాడుకోవచ్చు.. మిగతా 120 యూనిట్లను గ్రిడ్‌కు అనుసంధానం చేయొచ్చన్నారు. సంవత్సరానికి 4 వేల రూపాయల విలువైన కరెంట్ ఉచితంగా వినియోగించుకోవచ్చని, అదనంగా మరో 5 వేలు రూపాయల వరకు ఆదాయం వస్తుందని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

==================================

రాష్ట్రంలో రహదారుల నిర్మాణాన్ని వచ్చే డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లె పట్టణంలో బైపాస్ రింగ్ రోడ్డు నిర్మాణానికి మంత్రి ఈ రోజు

శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వచ్చే డిసెంబర్ నాటికి రాష్ట్రంలో రహదారులకు పూర్వ వైభవం తీసుకొస్తామని, అలాగే గుంతల రహిత రహదారులే లక్ష్యంగా 861 కోట్ల రూపాయలతో చేపట్టిన మరమ్మతు పనులు ఈనెల ఆఖరికి పూర్తి చేస్తామని తెలిపారు. దాదాపు 50 శాతం రహదారుల మరమ్మతులను ఇప్పటికే పూర్తి చేశామని మంత్రి వెల్లడించారు.

===================================

విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే భవిష్యత్ ఏర్పరచుకోవాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలో ఈ రోజు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సంస్కృతిని గుర్తు చేసేలా విద్యారంగంలో విశేష సేవలందించిన వ్యక్తుల పేర్లను ప్రభుత్వ పథకాలకు పెట్టి, వాటిని సమర్థవంతంగా ముందుకు తీసుకెళుతున్నామని చెప్పారు.

===================================

గిరిజన గ్రామాలలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సాలూరు నియోజకవర్గంలోని 100 సీసీ రోడ్లు ప్రారంభోత్సవంలో భాగంగా ఈరోజు జిల్లాలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సుమారు 7 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సీసీ రహదారులు, కాలువలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వ కృషితో ఈ ఆరు నెలల వ్యవధిలోనే సీసీ రోడ్లు, బీటి రోడ్లు నిర్మించి అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చూట్టామని తెలిపారు. విద్య, వైద్యం, తాగు నీరు, సాగు నీరు, రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

===================================

రైతుల కుటుంబాల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం సంక్రాంతి సందడి తెచ్చిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. ధాన్యం సేకరించిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలియజేశారు. నిన్నటి వరకూ 27 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించామని, రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు 6,083.69 కోట్ల రూపాయల జమ చేశామని మంత్రి తెలిపారు.

===================================

తూర్పు గోదావరి జిల్లా కమిటీకి పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరిని రాజమహేంద్రవరం అధ్యక్షురాలుగా నియమిస్తూ.. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఆ జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రీ పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అధ్యక్షతన ఈ నెల 9వ తేదీన సమావేశం జరుగుతుందని, తూర్పుగోదావరి జిల్లా అధికారులు తప్పక హాజరు కావలసినదిగా కలెక్టర్ ఆదేశించారు.

===================================

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పెరగాలనేది ముఖ్యమంత్రి లక్ష్యమని, దానికి అనుగుణంగానే నిబంధనలు సరళిస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ తెలిపారు. విజయవాడలోని రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) కార్యాలయంలో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై మంత్రి నారాయణ ఈరోజు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. క్రెడాయ్, నరెడ్కో ప్రతినిధులతో పాటు బిల్డర్లు, డెవలపర్లు, ప్రజల నుంచి మంత్రి స్వయంగా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భవనాలు, ప్లాట్లు కొనుగోలు చేసేవారు ప్రకటనలు చూసి మోసపో వద్దని, కొత్తగా రూపొందించిన నిబంధనలను వచ్చే గురువారం జారీ చేస్తామని తెలియజేస్తూ....

(వాయిస్ 24 సెకన్లు)

విరామం

====================================

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మొదటిసారిగా ఆరోగ్యశ్రీ ఆర్థిక ప్రోత్సాహకాలను సంబంధిత వైద్యులకు, నర్సులకు, ఇరత మెడికల్ సిబ్బందికి అందజేశారు. ఈ రోజు కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 10 లక్షల రూపాయల చెక్కును ఆసుపత్రి వైద్య పర్యవేక్షకురాలు డాక్టర్ విశ్వ మిత్రకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆరోగ్య శ్రీ విభాగాన్ని ఎపివివిపి నుండి వైద్య విద్యకు మార్చిన అనంతరం ఈ సంవత్సరంలో జమ అయిన 10 లక్షల రూపాయలను ప్రభుత్వ నిబంధనల మేరకు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఇక ముందు కూడా ఆరోగ్యశ్రీ ఇన్సెంటివ్ ను సంబంధిత డాక్టర్లకు, సిబ్బందికి పంపిణీ చేయాలని కలెక్టర్ సూచించారు.

====================================

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 14వ తేదీ నుంచి 31 వరకు జంతు సంక్షేమ పక్షోత్సవాలు జరగనున్నాయని ఎన్.టి.ఆర్. జిల్లా కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. పశుసంవర్ధక శాఖ.. జంతు సంరక్షణ సంఘాలు, తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ పక్షోత్సవాలు నిర్వహించాలని సూచించారు. పక్షోత్సవాల సందర్భంగా చర్చలు, నిపుణులతో ఇంటర్వ్యూలు, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు సర్టిఫికేట్లు, బహుమతులు అందించనున్నామని తెలిపారు. జంతు సంక్షేమ చట్టాలు, నిబంధనలపై అవగహన కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో కైండ్‌నెస్ క్లబ్‌లు ఏర్పాటు చేస్తామని, అధికారుల సమన్వయంతో పక్షోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

====================================

మహిళా అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. దేశంలోని గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు ఉపాధి కోసం వలస వస్తున్న వేలాది మంది మహిళలకు సురక్షితమైన వసతి అందించటానికి “సఖి నివాస్” పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తున్నాయి. గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం మహిళా ప్రాంగణంలో ఈ సఖి నివాస్ ను ఏర్పాటు చేశారు. రుచికరమైన భోజనం, సౌకర్యవంతంగగా ఫ్యానులతో కూడిన పడకలు, పరిశుభ్రమైన మరుగుదొడ్లతో పాటు మహిళలకు అవసరమైన వైఫై తో సహా సకల సౌకర్యాలతో ఈ వసతి సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ వసతి సముదాయాన్ని ఈ నెల 21 న రాష్ట్రమంత్రులు, అధికారులు ప్రారంభించనున్నారు.

====================================

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ - సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (ICAR-CIFT), విశాఖపట్నం పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో ఆక్వా ఉత్పత్తులపై మత్స్య శాఖ అధికారులకు ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు జి. పవన్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈశాన్య రాష్ట్రాల్లో రొయ్యల ఆక్వాకల్చర్‌ను ప్రవేశపెట్టడానికి విస్తారమైన అవకాశాలు ఉన్నాయని సూచించారు. పంజాబ్, హర్యానా రాష్ట్రాలు ఇప్పటికే లోతట్టు రొయ్యల ఆక్వాకల్చర్ ప్రయోజనాలను పొందుతున్నాయని ఆయన ఉదాహరించారు.

====================================

“ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన” ద్వారా గృహ వినియోగదారుడే విద్యుత్ ఉత్పత్తిదారుడిగా మారే అవకాశం ఉందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సంయుక్త కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. అధిక ప్రయోజనాలు కలిగిన సూర్య ఘర్ యోజనను సద్వినియోగం చేసుకునేందుకు ప్రజలు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకుని తమకు నచ్చిన వెండర్ల ద్వారా సోలార్ రూఫ్ టాప్ సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈపీడీసీఎల్ పరిధిలో విస్తృత ప్రచారం కల్పించి, పీఎం సూర్య ఘర్ యోజనపై అవగాహన సోలార్ వినియోగంపెంచడమే లక్ష్యమన్నారు. ప్రస్తుతం మనం ఉపయోగిస్తున్న విద్యుత్తు తయారీలో 30 శాతం బొగ్గు ఆధారితంగా తయారవుతుందని, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలనే సంకల్పంలో భాగంగా ఈ పథకానికి శ్రీకారం చుట్టామన్నారు.

====================================

జిల్లాలోని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. పాలకొండ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలోని బ్లడ్ సెంటర్ లో రక్తదాన శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమం ఈరోజు రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాతలకు అభినందనలు తెలిపి, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిల్లాలో రక్తం కొరతను అధిగమించేందుకు "నేను సైతం" కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిందని అన్నారు. జిల్లాలో అనీమియా, తలసేమియా, సికిల్ సెల్ వంటి సమస్యలు ఉన్నాయని, వీటితో పాటు అత్యవసర సమయాల్లో రక్తాన్ని అందించేందుకు సరిపడా నిల్వలు లేనందున దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.

====================================

====================================